క్లుప్తంగా

15 నుంచి 'సీఎం కప్'

చేవెళ్ల: ఈనెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయిలో చీఫ్ మినిస్టర్ కప్–2023 క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్‌కుమార్ తెలిపారు. 15–36 సంవత్సరాల మధ్య ఉన్న వారు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయని చెప్పారు. మండలంలోని పామెన, కందవాడ క్రీడా ప్రాంగణాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9347216828,, 8555922212లను సంప్రదించాలని కోరారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

మున్సిపల్ చైర్మన్ నరేందర్



పూజలో పాల్గొన్న నరేందర్, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నేత సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, గ్రంథాలయ కమిటీ వైస్ చైర్మన్ అందె మహేశ్వర్, కార్తీక్, తాటిశెట్టి ప్రకాష్, కలకొండ కృష్ణయ్య, బిక్కుమళ్ళ శ్రీకాంత్, శంకర్‌లాల్ లాహోటీ, శ్యాం, చగన్ మలానీ, రాజేష్, శేరి శ్రీనివాస్‌రెడ్డి, ఓం ప్రకాష్, పోకల శ్రీశైలం, భూషం నరేష్, ప్రభాకర్, శివ కిరణ్, రాజన్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ



మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరభద్ర గురుస్వామి

చేవెళ్ల: మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో సోమవారం చేవెళ్లకు చెందిన బీర్ల మల్లమ్మ జ్ఞాపకార్థం వారి మనమలు బీర్ల రాముయాదవ్, లక్ష్మణ్‌యాదవ్‌లు సహకారంతో ఉచితంగా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్ర గురుస్వామి (కాశివాసి) ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణ పంతులు గురుస్వామి, కె.తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, సత్యం, చంద్రశేఖర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, రాంప్రసాద్, జనార్దన్, అంజన్‌కుమార్, రామకృష్ణ, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి

కేశంపేట: 'భరోసా' బ్యానర్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ కాకునూరు గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్, చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఏర్పాటు చేసిన భరోసా కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారన్నారు. బీఎస్పీ ఎదుగుదలను చూసి ఓర్వలేకే ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యానర్‌ను తొలగించిన వారిని పోలీసులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమయ్య, హరికుమార్, శ్రీనివాస్, నరేశ్, రాజు, అనిల్, మల్లేశ్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ కరపత్రాల ఆవిష్కరణ

కేశంపేట: ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో ఈనెల 14న ఆవిష్కరిస్తున్న పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు శ్రీశైలం ముదిరాజ్, శంకర్ ముదిరాజ్‌లు మాట్లాడుతూ.. షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

వైభవంగా బీరప్ప కల్యాణం

నందిగామ: మండల పరిధిలోని వీర్లపల్లిలో కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి, కామరాతి కల్యాణాన్ని గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారులు ప్రత్యేకంగా వేషధారణ వేసి బీరప్ప స్వామి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం గొర్రెలతో బలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణోత్సవానికి పలు గ్రామాల నుంచి వేలాది మంది హాజరు కావడంతో గ్రామం జనసందోహంతో నిండిపోయింది. బీరప్ప స్వామి కళ్యాణానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీసీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

- జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్
- సగానికిపైగా ప్రజాప్రతినిధులు సమావేశానికి డుమ్మా



మాట్లాడుతున్న గణేశ్

నందిగామ: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గణేశ్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతీ నెల ప్రత్యేక నిధులు అందజేస్తుందన్నారు

చర్చించిన అంశాలు

- అప్పారెడ్డిగూడలో పంచాయతీకి సొంత భవనం నిర్మించాలని సర్పంచ్ జేకే.నర్సింహులు కోరారు. గ్రామాభివృద్ధి కోసం మట్టిని ఎక్కడి నుంచి తీసుకురావాలని, మట్టిని చెరువులు, ప్రభుత్వ భూముల్లో నుంచి తీస్తే కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రొటోకాల్ పాటించకుండా ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వడం లేదని కొమ్ము కృష్ణ సభకు వివరించారు. నందిగామలో గ్రంథాల ఏర్పాటుకు అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- మిగిలిన అంశాలను ఆయా శాఖల అధికారులు సభకు వినిపించి సమావేశాన్ని ముగించారు.

ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరు

ప్రతీ మూడు నెలలకు ఒక సారి నిర్వహించే మండల సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు హాజరై గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపచేసుకునేందుకు చక్కని వేదిక. కానీ సర్పంచ్‌లు ఈ సమావేశాలకు డుమ్మా కొడుతున్నారు. 18 మంది సర్పంచులకు కేవలం అప్పారెడ్డిగూడ సర్పంచ్ జేకే.నర్సింహ, మొత్కులగూడ సర్పంచ్ ఎల్లమ్మ మాత్రమే హాజరు కాగా ఎంపీటీసీ సభ్యులు సైతం సగానికి పైగా డుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో ఎంపీపీ ప్రియాంక, వైస్ ఎంపీపీ మంజుల, ఎంపీటీసీ సభ్యులు కృష్ణ, కుమార్, రాజు నాయక్, కో ఆప్షన్ సభ్యుడు బేగ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఫ్రీజింగ్' ఎత్తివేయాలి

- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్
- విద్యుత్ సమస్యలు పరిష్కరించడం లేదని సభ్యుల ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

షాద్‌నగర్: గ్రామ పంచాయతీ ఖాతాలకు ప్రభుత్వం విధించిన ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని పలు గ్రామాల సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం వైస్ ఎంపీపీ మానిక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. చించోడ్ గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు చేయాలని మిషన్ భగీరథ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ శివజ్యోతి వాపోయారు. గ్రామంలో మరొక ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించాలని సర్పంచ్ అమృతమ్మ కోరారు. లింగారెడ్డిగూడలో పైప్‌లైన్ లీకేజీల మరమ్మత్తులు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌కుమార్, రవీందర్ వాపోయారు. రామేశ్వరం గ్రామంలో విద్యుత్ స్తంభం ఏర్పాటుకు అధికారులు రూ.10వేలు అడిగారని.. అందుకు అంగీకరించినా నేటికీ స్తంభం మార్చడం లేదని సర్పంచ్ సంపత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్‌రాథోడ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

దశలవారీగా గ్రామాభివృద్ధి



కుత్బుద్దీన్‌గూడలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: నియోజకవర్గంలోని గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి, కుత్బుద్దీన్‌గూడ, అప్పోజిగూడ గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రాధాన్యతను బట్టి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంఏ రవూఫ్, టీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, పద్మమ్మ, రాజు, కుమార్, ఎంపీటీసీలు మోర శ్రీనివాస్, అంజయ్య, అర్జున్, కోఆప్షన్ సభ్యుడు బిలాల్, మాజీ సర్పంచ్ పాషా, మాజీ ఎంపీటీసీ వెంకటేష్ పాల్గొన్నారు.

బీరప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఇష్ట కుల దైవాలను భక్తి శ్రద్ధలతో పూజించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని అప్పోజిగూడలో బీరప్ప స్వామి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. బీరప్ప, కామరాతిదేవి కల్యాణోత్సవం, బోనాల ఊరేగింపు కనుల పండువగా జరిగాయి. బీరప్ప స్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తిభావం, దైవచింతన అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, సర్పంచ్ రాజు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాజు, మాజీ ఎంపీటీసీ పెంటయ్య పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

షాబాద్: తిమ్మారెడ్డిగూడకు చెందిన అనిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.లక్ష విలువగల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ పాండు పాల్గొన్నారు.

జీఓ వచ్చే వరకు జీపీకి వెళ్లం

జేపీఎస్, ఓపీఎస్‌ల స్పష్టీకరణ



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు

షాద్‌నగర్‌రూరల్: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తున్నామని ప్రభుత్వం జీఓ విడుదల చేసే వరకు జీపీలకు వెళ్లేది లేదని పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకునే సమయంలోనే ప్రభుత్వం రెగ్యులరైజ్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేసిందని అన్నారు. మూడేళ్ల ప్రొబేషనరీ కాలపరిమితి అనంతరం ప్రభుత్వం పొడిగించిన మరో సంవత్సర కాలం ముగిసినప్పటికీ క్రమబద్ధీకరణ విషయాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రొబేషనరీ పీరియడ్ తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన జూనియర్ పంచాయితీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి జేపీఎస్, ఓపీఎస్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వప్నరెడ్డి, శ్రీనివాస్, ప్రమోద్, శ్రీరాం, ధీరజ్, రాధాకృష్ణ, జగదీష్, వెంకటేష్, పవన్, అనిత, రజని, వీణా, సౌమ్య, వరలక్ష్మి, నిరంజన్, అనిల్, యాదయ్య, వినోద్, పాండురంగారెడ్డి, ఫయాజ్, మురళి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అడ్డుకుంటారా?

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్

మొయినాబాద్: జేబీఐటీ కళాశాలలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నిస్తే కళాశాలకు రాకుండా అడ్డుకుంటున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవరాల రాజేశ్ ఆరోపించారు. సోమవారం ఆయన మొయినాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ జేబీఐటీ కళాశాలలో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. సరైన వసతులు లేకపోవడంతో వాటి కోసం యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు తనను కళాశాలలోకి రాకుండా సెక్యూరిటీ సిబ్బందితో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జేబీఐటీ కళాశాలలో తాను బీటెక్ చదివానని.. ఇంకా కొన్ని సబ్జెక్టులు ఉండటంతో తాను కళాశాలకు వెళ్లే అవకాశం ఉన్నా యాజమాన్యం జేఎన్‌టీయూ నిబంధనలకు విరుద్ధంగా తనను కళాశాలలోకి రానివ్వడం లేదన్నారు. క్లాస్ రూంలలో వర్షం పడినప్పుడు పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయని.. హాస్టల్లో ఉండే విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యలన్నింటిపై ప్రశ్నించినందుకే తనను వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై జేఎన్‌టీయూలో ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

నిరుద్యోగ యువతతో చెలగాటం



యువ సంఘర్షణ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

టీపీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలాడుతున్నాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం నగరంలో నిర్వహించిన యువ సంఘర్షణ సభకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ/ అర్పించారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అన్న కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించాయన్నారు. ఉద్యోగాలు రాకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. ఈ పాపం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే అన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాడేందుకే కాంగ్రె యువ సంఘర్షణ సభను నిర్వహిస్తోందన్నారు. నిరుద్యోగులను విస్మరించిన బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సభకు వెళ్లిన వారిలో బాబర్ అలీఖాన్, కృష్ణారెడ్డి, రాజు, హరినాథ్‌రెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహ, రాంరెడ్డి, వీరేశం, అందె మోహన్, ఖదీర్, ముబారక్ అలీఖాన్, సింగారం సుదర్శన్, సీతారాములు, అంజి యాదవ్, నర్సింహ, శ్రీకాంత్, అశోక్‌లున్నారు.

ఎన్టీఆర్‌తోనే రాజకీయ చైతన్యం

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు



జెండాను ఆవిష్కరిస్తున్న బక్కని నర్సింలు

కేశంపేట: దివంగత ఎన్టీఆర్‌తోనే ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను సోమవారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. బక్కని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ హయాంలోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి జరిగిందని తెలిపారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించిన నేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆత్మగౌరవ నినాదం పుట్టి తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాడని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలని కోరారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజలు సమస్యలను గుర్తించాలని వాటి పరిష్కారం కోసం పోరాడాలని కోరారు. తద్వారా పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, రమేష్, వెంకటయ్య, రాజశేఖర్‌రెడ్డి, శేఖర్, శివానంద్, శేఖర్‌గౌడ్, పాండు, గణేష్, శంకర్, జహంగీర్, భిక్షపతి, హన్మంతు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

కొందుర్గు: భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికే నిర్దేశం చూపించే రాజ్యాంగం, అందులో పొందుపరిచిన అంశాలు, చట్టాలపై అవగాహన కలిగేలా రాజ్యాంగాన్ని అందరికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిక్షపతి, శ్రీను, నరేష్, గిరి, నర్సింలు, కుమార్, గోపాల్, మల్లేష్, రాములు, పెంటయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీ కల్యాణి బదిలీ

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌గా విధులు నిర్వహిస్తున్న కల్యాణిని కందుకూరుకు బదిలీ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల సర్వసభ్య సమావేశంలో బదిలీపై వెళుతున్న కల్యాణికి ప్రజా ప్ర తినిధులు, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, వైస్ ఎంపీపీ మౌనిక, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ, వివి ధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

సర్పంచ్ అంజయ్య

కేశంపేట: యువత చదువుతో పాటు క్రీడాల్లోను రాణించాలని సంతాపూర్ గ్రామ సర్పంచ్ అంజయ్య అన్నారు. రెండు రోజులుగా గ్రామంలో బీజేపీ సంస్కృతికశాఖ జిల్లా కో–కన్వీనర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సమ్మర్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి సర్పంచ్ సోమవారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. క్రీడాల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడలు ఆడట వల్ల మానసిన ఉల్లాసంతోపాటు శారీరక ధృఢత్వం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, సాజిద్, శ్రీశైలం, అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌లో ఉపాధి హామి పథకంలో భాగంగా పనులు చేస్తున్న ప్రదేశాన్ని సోమవారం సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ బిల్లులు సకాలంలో వస్తున్నాయా అంటూ కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంగయ్య మాట్లాడుతు కూలీలకు పని ప్రదేశంలో టెంట్లు వేసి సేద తీర్చుకోవడానికి నీడ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిచో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, అనంతయ్య, జంగయ్య, చంద్రమ్మ తదితరులు ఉన్నారు.

అంధత్వ నివారణ కోసం కంటివెలుగు



కంటి వెలుగు శిబిరం ముగింపు కార్యక్రమంలో సిబ్బందికి సన్మానం చేసిన సర్పంచ్ జహంగీర్

డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

చేవెళ్ల: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ అన్నారు. సోమవారం చేవెళ్ల మండలం ఊరేళ్ల గ్రామంలో పది రోజుల పాటు జరిగిన కంటి వెలుగు శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కంటి సమస్యలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేసి వారి సమస్యలను గుర్తించామని, తగిన చికిత్సలు, కంటి అద్దాలు అందించామని తెలిపారు. అందత్వ రహిత తెలంగాణగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. గ్రామాల్లో ఈ కంటి వెలుగు శిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. ఊరేళ్ల గ్రామంలో ప్రజలు ముందుకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జహంగీర్, వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, ఉప సర్పంచ్ విఠలయ్య, సీహెచ్ఓ గోపాల్‌రెడ్డి, కంటి వెలుగు అధికారి డాక్టర్ సుష్మ,, సౌందరర్య పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు ప్రయోజనం

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నక్కలపల్లి సర్పంచ్ స్వప్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని నక్కలపల్లిలో కంటి వెలుగు శిబిరం ముగింపు సమావేశంలో వైద్యులను ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంధత్వ నివారణ కోసం కంటి వెలుగు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. గ్రామంలో వారం రోజుల పాటు వైద్యులు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించి అద్దాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుష్మ, చైతన్య, అబ్దుల్ కలీం, ఏఎన్ఎంలు జ్ఞానేశ్వరి, గంగ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా చలాన్లు..!

కానిస్టేబుల్‌పై వాహనాదారుల ఆగ్రహం

శంకర్‌పల్లి: ఇష్టానుసారంగా చలాన్లు విధిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై జనం తిరగబడ్డారు. సోమవారం శంకర్‌పల్లి చౌరస్తాలో విధి నిర్వహణలో భాగంగా కానిస్టేబుల్ దశరథ్ చలాన్లు విధిస్తున్నాడు. దీంతో వాహనదారులు గొడవకు దిగారు. చూస్తుండగానే జనం గుమిగూడారు. కానిస్టేబుల్‌ను నిలదీశారు. ''ప్రతి రోజు ఇదే చౌరస్తా నుంచి పదిసార్లు తిరుగుతుంటాం.. ఎన్నిసార్లు ఫొటోలు తీస్తారు. ఇష్టానుసారంగా చలాన్లు వేయడం ఏమిటి? ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా తిరిగే వాహనాల గురించి పట్టించుకోరా'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద కార్లన్నీ రోడ్లపైనే పార్కు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. పేదోడికి న్యాయం.. ఉన్నోడికి న్యాయమా అని ప్రశ్నించారు. పట్టణంలో పార్కింగ్ సౌకర్యంలేని షాపుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో కానిస్టేబుల్ చేసేదేమి లేక కెమెరాలో నుంచి ఫొటోలను తొలగించారు.



ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగిన వాహనదారులు